# చెంచా! లేదా చాకు!

రాజారాం చాలాకాలమయిందని తన చిన్ననాటి స్నేహితుడు శ్రీధర్‌ని చూడ్డానికి వాళ్ళింటికెళ్ళాడు.

లోపల్నుంచి పెద్దగా శ్రీధర్ అరుపులు వినపడుతున్నాయ్! 'వీడి కోపం తగ్గినట్టు లేదు! ఎవరిమీదో అరుస్తున్నాడు' అనుకుంటూ 'అసలు వీడు చిన్నప్పటి నుంచి అంతే! ప్రతీ చిన్న విషయాన్నీ గోరంతలు కొండంతలు చేసుకుని, వాడు అందరితో వాదనలు పెట్టుకునేవాడు. అనుకుంటూ ఇంట్లో ఎవరు పిలిచినా పలకకపోవడంవల్ల కాస్సేపు ఎవరైనా లోపల్నుంచి వస్తారేమోనని అట్లాగే నుంచున్నాడు.

శ్రీధర్ గొంతు ఇంకా పెద్దగా వినిపిస్తోంది. 'చిన్నప్పటినుంచీ ఎంతో భయభక్తులతో పెంచితే చివరికి ఇదా బాబూ నువ్వు చేసింది?

"ఏం చేశాను నాన్నా నేను? ప్రతి విషయంలోనూ మీరు చెప్పినట్టుగానే నడుచుకున్నాను. మొన్న మీరు పంపించిన సిమెంటు ఫ్యాక్టరీ ఇంటర్వ్యూలో నేను ఎంతో వినయంగా మాట్లాడి ఎంతో గౌరవంగా వారి ప్రశ్నలకు సమాధానం చెబుతూ, భయభక్తులతో, శ్రద్ధాశక్తులతో వెళితే, ఇంతవరకూ ఆ ఇంటర్వ్యూ ఫలితాలు అతీగతీ లేదు. నాకు తెలుసు అది ఇంకెవరికో పోయుంటుందని' అన్నాడు.

మాటలని బట్టి అతడు శ్రీధర్ పెద్దకొడుకు ప్రమోద్ అని గ్రహించాడు రాజారాం. ఇతరుల మాటలని అలా దొంగచాటుగా వినకూడదని తెలిసినా, సంభాషణ ఏదో జనరల్ టాపిక్ మీద ఉద్యోగాలూ గొడవలకి సంబంధించినదిలా వుండటంవల్ల వింటూ నుంచున్నాడు.

"నాన్నా! వాళ్ళు సెలెక్ట్ చేసే వాళ్ళు ఎటువంటి వాళ్ళో తెలుసా? ఉంటే 'చెంచా' అయి ఉండాలి! లేకపోతే 'చాకు'అయి ఉండాలి?" అన్నాడు ప్రమోద్. ఆ మాటలు అక్కడ ఉన్న శ్రీధర్‌కే కాదు, బయటనుంచున్న రాజారాంకి కూడా అర్థం కాలేదు.

"ఏమిట్రా ఆ మాటలు? చెంచా లేమిటి? చాకు లేమిటి?" అన్నాడు శ్రీధర్.

"నాన్నా మా ఆఫీసులో ఒకతను ఉన్నాడు ఈశ్వర్ అని. అతనికి పొట్టకోస్తే అక్షరం ముక్క లేదు. కానీ ప్రతి సీనియర్ ఆఫీసరుకీ, ఎవరు ట్రాన్స్ఫర్ అయి ఎవరొచ్చినా, 'సార్, సార్' అంటూ వెనకవెనకే తిరుగుతాడు పెంపుడు కుక్క లాగా!

"నీకు బుద్ధి లేదు. ఇడియట్" అని ఒకసారి ఒక ఆఫీసరు కోప్పడితే, చిరునవ్వు నవ్వుతూ అలాగే అతని కేసి చూస్తూ నుంచున్నాడు, చిదానంద రూపుడిలాగా!

"ఎన్నిసార్లు చెప్పాను ఈ చిన్నచిన్న విషయాల ఫైలు నాకు పంపించొద్దని! వాడు లీవులో వెళ్ళాడూ, వీడూ లీవులో వెళ్ళాడూ ఇవి చూడటానికేనా నేనున్నది? నాకు వేరే పనిలేదా?" కసురుకున్నాడా ఆఫీసరు.

"అవునుసార్! ఇంకోసారి పంపించను సార్! మీరు చెప్పింది కరెక్ట్!"

"ఏమిటి కరెక్ట్ నీ బొంద!" మరీ విసుగ్గా కోపంగా అరిచాడా ఆఫీసరు.

"ఎస్సార్!" అన్నాడు అదే చిదానంద రూపంతో

ఆ తరువాత రెండు రోజులకి ఆ ఆఫీసర్ ఈశ్వర్ని పిలిచాడు.

"ఏమయ్యా! కమలాకరరావుగారిని పిలిస్తే కనబడడేమి?" అడిగాడు ఆఫీసరు.

"అతను లీవులో వెళ్ళాడు సార్" నవ్వుతూ చెప్పాడు చిదానంద రూపుడు ఈశ్వర్.

"నువ్వుత్త ఇడియట్ లాగున్నావేమయ్యా? అతను లీవులో వెళుతున్నాడన్న సంగతి నా కెట్లా తెలుస్తుంది? ఆ ఫైలు నాకు పంపించొద్దా?" అరిచాడు ఆఫీసరు.

"అవును సార్!" అదే చిరునవ్వుతో ఆనందంగా నుంచున్నాడు ఈశ్వర్!



కథా నిలయం
3813
శ్రీకాకుళం

"ఏమిటయ్యా! అవునూ, అవునూ! నీకు మతుందా అసలు? ఉత్త ఫూల్‌వి!"

"....."

"మాట్లాడవేం?" కోపంతో ఊగిపోయాడు ఆఫీసరు.

"ఎస్ సార్!" అదే నవ్వు.

"నీ బొంద! అదిసరే వెళ్ళి ఇంట్లో మా ఆవిడ ఏదో ఎలక్ట్రీషన్ కావాలని చెప్పింది. చూడు అదేదో!"

"ఎస్‌సార్!" నవ్వుతూ బయటికొచ్చి ఎలక్ట్రీషన్‌తో సహా, వారి ఇంటికెళ్ళాడు. వీళ్ళని చెంచా అంటారు నాన్నగారూ! వీరికి సిగ్గూ ఎగ్గూ ఉండదు. పందిని చూపించి "ఇది నంది కదూ?" అంటే అతని మెప్పు పొందడానికి అది పంది అని తెలిసినా, "ఎస్ సార్! ఇది నందే!" అంటారు. ఇలాంటివాళ్ళు ఎవరు పై వాళ్ళయితే వాళ్ళ కనుగుణంగా తందాన తానపాడుతూ, బాగానే వుంటారు. అంటే వీళ్ళకి ఒక వ్యక్తిత్వం వుండదు. ఆత్మాభిమానం వుండదు. ఎలాగో అలాగ బతకడమే ప్రధానం!

"ఇహ చాకు సంగతి!" వీళ్ళు దబాయించి, ఆఫీసర్ని హడలగొట్టి పన్లు చేయించుకుంటారు. ఆఫీసరు గదిలో అందిరిముందూ ఆ ఆఫీసరు, తన కన్యాయం చేస్తున్నాడనో, తనడిగినది ఇవ్వలేదనో అనిపించేసరికి, అతని పరువు తీస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారు. ఒక్కొక్కసారి, ఆఫీసరుకన్నా ఎక్కువస్థాయిలో వీళ్ళే అరుస్తారు.

మా దగ్గర పండరినాథ్ అనే అటెండరుండేవాడు. వాడు తన ప్రమోషన్ ఆరు నెలలు ఆగిపోయిందని (వాడికి రికార్డు అసిస్టెంట్ ఏదో రావాలి లే!') పదిమంది ఇతర ఆఫీసు అటెండర్లనీ, యూనియన్ వాళ్ళని తీసుకొచ్చి ఆ ఆఫీసరుని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేడు, అందరి ముందరా! ఆ ఆఫీసరు భయంతో వొణికి పోయాడు. దూరం నుంచి వినేవాళ్ళకి ఇతను ఆ ఆఫీసర్ని

కొట్టాడేమో నన్న అనుమానం కూడా వస్తుంది. అందరూ ఆ ఆఫీసరు ఈ అటెండర్ని డిస్మిస్ చేస్తాడనుకున్నారు. కానీ వారం తిరక్కుండా అతడు ప్రమోషన్ కొట్టేసి హాయిగా తిరగడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అదీ నాన్నగారు 'చాకు' అంటే! దబాయించి! గూండాగిరిచేసి పన్లు చేయించుకోవడం.

ఈ రోజుల్లో బతకాలంటే 'చెంచా'గానైనా ఉండాలి. లేదా 'చాకు' గానైనా ఉండాలి. అంతేగాని మీరు చెప్పిన భయభక్తుల పాఠం, ఆ నీతి పాఠాలు పనిచెయ్యవు. మీ నమ్రతని చాతకాని తనంగా, మీ విధేయతని పనికిరాని తనంగా ఊహించుకునే ఈ రోజుల్లో, నీతికే అర్థాలు మార్చేస్తున్నారు! ధర్మానికి మార్గాలు వేరే బోధిస్తున్నారు!" అన్నాడు ప్రమోద్ ఆవేశంగా.

"బాబూ! నీ బాధ నాకర్థమయింది నాయనా! కానీ ఒక్కటి గుర్తుంచుకో! ఇది అన్ని వేళలా వర్తించదు. ఈ విజయాలు తాత్కాలికం! ఎప్పటికైనా, నీతీ న్యాయం తలెత్తక తప్పదు. అదే శాశ్వతమైన విజయం! మన పురాణాలు, మన ఇతిహాసాలూ పుక్కిటికథలు కావు! నీతి మార్గానికీ, సహజీవనానికీ, సమానత్వానికీ సహనానికీ, వేసిన సుగతి బాటలు!" అన్నాడు శ్రీధర్ కొడుకు బాధని మరిపిస్తూ. అంతలో ఎవరో లోపల్నుంచొచ్చి "ఎవరు కావాలండీ?" అన్నారు రాజారాంని చూసి!

"శ్రీధర్! ఉన్నాడా?" అడిగాడు ఉలిక్కిపడి రాజారాం.

రాజారాం గొంతువిని బయటికొచ్చాడు శ్రీధర్! అంతలో 'టెలిగ్రాం' అంటూ వచ్చాడు టెలిగ్రాం బంట్రోతు.

"ఎక్కడినుండి బాబూ!" వణుకుతున్న చేతులతో సంతకం చేసి తీసుకుని, చింపి చదివాడు శ్రీధర్! ఉత్సాహంతో "బాబూ ప్రమోద్! న్యాయం ధర్మం భూమ్మీద పూర్తిగా చచ్చిపోలేదురా! నీకు సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది" అరిచాడు శ్రీధర్. తన బాధలు వృథా కానందుకు గర్వంగా నవ్వుతూ! రాజారాం తృప్తిగా నిట్టూర్చాడు.

*